సాక్షి

వైఎస్‌ఆర్ జిల్లా

సోమవారం ׀ 14 ׀ ఏప్రిల్ ׀ 2025



బంగారు దుకాణంలో చోరీ

ఖాజీపేట బస్టాండ్‌లోని బంగారం దుకాణంలో చోరీ సంఘటన సంచలనంగా మారింది. పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే చోరీ జరగడం భయాందోళనకు గురి చేస్తోంది. -8లో



వక్ఫ్ సవరణ బిల్లు రద్దు అయ్యే వరకు పోరాడతాం

వక్ఫ్ సవరణ బిల్లు రద్దయ్యేంత వరకు నిరసనలు తెలుపుతూనే ఉంటామని వక్ఫ్ బోర్డు జాయింట్ యాక్షన్ కమిటీ స్పష్టం చేసింది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0/26.4

జిల్లాలో ఆదివారం 26.4 – 40.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' రద్దు

కడప అర్బన్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జరిగే ' ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'ను' సోమవారం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

సీనియారిటి జాబితాను సరిచూసుకోండి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ జోన్ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూల్ ఉమ్మడి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టీఐఎస్)లోని సీనియారిటి జాబితాను పరిశీలించుకోవాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యాముల్ సూచించారు. ఉపాధ్యాయులు తమ టీఐఎస్ ప్రొఫైల్‌కి లాగిన అయి వ్యక్తిగత వివరాలను జాగ్రత్తగా పరిశీలించి ఓటీసీ ద్వారా ధ్రువీకరించాల్సి ఉంటుందన్నారు. టీఐఎస్‌లోని సీనియారిటి జాబితాలో ఏవైనా పొరపాట్లు ఉంటే నిర్దేశిత గడువులోపల సంబంధిత జిల్లా విద్యాశాఖధికారి కార్యాలయంలో అభ్యంతరాలను తెలియజేయాలని సూచించారు.

జీఐపీకేఎల్‌లో రాయచోటి వాసి



అలీ అహమ్మద్

రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటి పట్టణం బోసనగర్‌కు చెందిన అలీ అహమ్మద్(22) ఈ నెల 18, 19, 20వ తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే కబడ్డీ జీఐపీకేఎల్(గ్లోబల్ ఇండియా ప్రవాసి కబడ్డీ లీగ్)లో లయన్స్ తమిళ్ టీం తరపున ఆడనున్నారు. ఈయన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పట్టా పొందారు. అలీఅహమ్మద్ చిన్ననాటి నుంచే కబడ్డీ ఆట ఆడాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లేవాడని అతని తండ్రి షబ్బీర్ తెలిపారు. విద్యతోపాటు క్రీడా రంగంలో రాణించిన ఆ యువకుడికి రాయచోటి, జిల్లా ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు. రానున్న రోజులలో అంతర్జాతీయ క్రీడలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతానికి, జిల్లాకు, రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు.

సమస్యాత్మక అటవీ ప్రాంతాల్లో తనిఖీలు



రోళ్లబోడు బీటులో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్

సిద్దవటం: సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని గొల్లపల్లె, రోళ్లబోడు, సిద్దవటం బీట్లలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ ఆదివారం తనిఖీలు చేపట్టారు. అనంతరం రోళ్లబోడు బేస్ క్యాంప్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపద తరలిపోకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండి వాహనాలు తనిఖీలు చేయాలన్నారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల పట్ల వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి తొట్లలో తాగునీరు నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం రేంజర్ బి.కళావతి, డీఆర్‌ఓ ఓబులేష్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



కాంగ్రిగేషనల్ చర్చిలో ఈత మట్టలతో విశ్వాసులు

కడప కల్చరల్: జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని జరుపుకున్నారు. ఏసుక్రీస్తు ఆత్మబలిదానాన్ని సూచిస్తూ దీనిని నిర్వహించారు. ఇందులో భాగంగా గురువుల ఆధ్వర్యంలో విశేష ప్రార్థనలు నిర్వహించారు. కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, పులివెందుల.. తదితర అన్ని ప్రాంతాల్లో చర్చిల్లో సామూహిక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా విశ్వాసులంతా చిన్నా పెద్ద సహితంగా ఈతమట్టలు చేతబూని చర్చి చుట్టూ క్రీస్తు ధ్యానం చేస్తూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు, వాక్య పరిచర్య చేయించారు. త్వరలో తపస్కాలం ముగియనుందని, క్రీస్తు త్యాగాన్ని సూచించే గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ సండేలు రానున్నట్లు గుర్తు చేశారు.


మండే ఎండ.. మంటతో జాగ్రత్త!

- 'అగ్ని ప్రమాదాల నుంచి 'అప్రమత్తత' ముఖ్యం!
- జిల్లాలోని అగ్నిమాపక శాఖలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు





కడపలోని అగ్నిమాపక కేంద్రం



కడప అర్బన్: జిల్లాలో రోజురోజుకు ఎండతీవ్రత పెరిగిపోతోంది. అగ్నిప్రమాదాలకు ఆస్కారం ఉన్న సమయమిది. జిల్లా వ్యాప్తంగా ప్రజలు అగ్నిప్రమాదాల బారి నుంచి తమను, తమతో పాటు చుట్టు ఉన్న సమాజాన్ని కాపాడుకునేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన తరుణమిది. ప్రజలకు అవగాహన కల్పించేందుకే సోమవారం నుంచి ఈ నెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఎలా స్పందించాలి.. నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి.. అసలు అగ్ని ప్రమాద శాఖ సిబ్బంది తదితర వివరాలతో ప్రత్యేక కథనం.

- వేసవికాలంలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. అప్రమత్తంగా ఉన్నా కొన్ని సమయాలలో ప్రాణనష్టంతో పాటు, ఆస్తినష్టం కూడా సంభవిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పైగా ప్రమాదాలను నివారించే అగ్నిమాపక శాఖలో సిబ్బంది కొరత వేధిస్తుండడం కలవరపరిచే అంశం. అరకొర సిబ్బందితోనే విధులు నిర్వహిస్తున్నారు. లీడింగ్ ఫైర్‌మెన్లు, ఫైర్మెన్లు, డ్రైవర్ కమ్ ఆపరేటర్లు, సిబ్బంది కొరతతో అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో ఇబ్బంది పడుతున్నారు. ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు గాను ఇద్దరే ఉన్నారు. ఇక స్టేషన్ ఫైర్ ఆఫీసరు రెండు స్టేషన్లలో లేకపోవడంతో ఇన్చార్జి లీడింగ్ ఫైర్మెన్లు విధులు నిర్వహిస్తున్నారు. డ్రైవర్ కమ్ ఆపరేటర్ 31 మందికిగాను ప్రస్తుతం 26 మంది విధులు నిర్వహిస్తున్నారు. 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఫైర్‌మెన్ 102 మంది ఉండాల్సి ఉండగా కేవలం 42 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 60 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 211 మందికి గాను 142 మందే పనిచేస్తున్నారు. దీంతో జిల్లాలో ఒకేసారి రెండుమూడు చోట్ల ప్రమాదాలు జరిగితే నష్టనివారణ చేయడం వీరికి కష్టసాధ్యంగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా 30 మంది హోంగార్డులతోనే విధులు నిర్వహిస్తున్నారు.

ముద్దనూరుకు ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

ప్రస్తుతం జిల్లాలో 8 ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో పాత భవనాలు కలిగి ఉన్న కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో నూతన భవనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ముద్దనూరులో ఫైర్ స్టేషను' ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు..

జిల్లాలోని అన్ని అగ్నిమాపక కేంద్రాల పరిధిల్లో 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించనున్నారు. కడప ఫైర్ స్టేషన్‌లో ఉదయం 10 గంటలకు ఈ వారోత్సవాలను ప్రారంభించనున్నారు. ప్రతి ఏడాది అగ్నిమాపక శాఖ వారు ఏప్రిల్ 14 నుంచి 20 వరకు 'అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాలు' నిర్వహిస్తున్నారు. అలాగే అవకాశం ఉన్నపుడల్లా... స్కూల్స్, కాలేజీలు, హాస్పిటల్స్, కడప నగర శివార్లలోని ఐఓసి గ్యాస్ ప్లాంట్, కర్మాగారాలలో అగ్నిమాపక అధికారులు విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు.

సిద్ధంగా ఉన్నాం



ఎటువంటి అగ్ని ప్రమాదాలు, విపత్తులు సంభవించినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. వాహనాలకు చిన్న చిన్న సమస్యలున్నప్పటికీ మరమ్మతులు చేయించాం. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ హోంగార్డులకు కూడా రెస్క్యూ ఆపరేషన్‌పై శిక్షణ ఇచ్చాం
-ధర్మారావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే 101కు సమాచారం అందించాలి.

జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు... ఫోన్‌నెంబర్ల వివరాలు

ఫైర్‌స్టేషన్/ఆఫీస్	హోదా	పేరు	ఫోన్‌నెంబర్లు	స్టేషన్ నెంబరు
	డీఎఫ్‌ఓ	ఐ.ధర్మారావు	99499 91068	08562- 241739
కడప	ఏడిఎఫ్‌ఓ	పి. బసివిరెడ్డి	99637 37191	08562- 242299
ప్రొద్దుటూరు	ఏడిఎఫ్‌ఓ	ఏ.రఘునాథ	99637 37486	08564-252999
జమ్మలమడుగు	ఎస్‌ఎఫ్‌ఓ	సత్యంరెడ్డి	99637 37395	08560-270099
పులివెందుల	ఎస్‌ఎఫ్‌ఓ	సునీల్‌కుమార్	99637 37552	08568-286177
కమలాపురం	ఎస్‌ఎఫ్‌ఓ	జనార్దన్ రెడ్డి	90637 37506	08563-274250
బద్వేల్	ఎస్‌ఎఫ్‌ఓ	చంద్రుడు	99637 37553	08569-284099
మైదుకూరు	ఎస్‌ఎఫ్‌ఓ	సత్యరాజ్(ఇన్‌ఛార్జ్)	99637 37634	87902 01101
పోరుమామిళ్ల	ఎస్‌ఎఫ్‌ఓ	నజీర్ అహమ్మద్	99637 37637	08569-210310
వేంపల్లి	ఎస్‌ఎఫ్‌ఓ	శివరామిరెడ్డి	94834 97203	9441768101

అగ్ని ప్రమాదాల నివారణపై పాటించాల్సిన నియమాలు



- ఇంట్లోని వస్తువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చిన్నపిల్లల దగ్గర అగ్గిపెట్టెలు,లైటర్లు, టపాకాయలు ఇతర మండే పదార్థాలు ఏవీ అందుబాటులో ఉంచరాదు.
- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా అజాగ్రత్తగా పారవేయరాదు.
- ఐ.ఎస్.ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలనే ఉపయోగించాలి.
- పాడైన వైర్లను వాడకూడదు. ఓవర్‌లోడ్ వేయకూడదు. ఎలక్ట్రికల్ సాకెట్ నందు దాని కెపాసిటీకి తగిన ప్లగ్‌ను మాత్రమే వాడాలి.
- ఇంటి నుంచి ఎక్కువ రోజులు సెలవులకు బయటకు వెళ్లనపుడు ఎలక్ట్రికల్ మెయిన్ ఆఫ్ చేయడం ఉత్తమం.
- ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగితే ఆర్పటానికి ఎళ్ల వేళలా నీటిని ఇంట్లో నిల్వ చేయాలి.
- గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే రెగ్యులేటర్ వాల్వ్‌ను ఆపివేయాలి. అలాంటి సమయంలో ఎల్రక్టికల్ స్విచ్‌లు ఆన్/ఆఫ్ చేయరాదు.
- స్కూల్స్, హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్‌లలో ఆర్‌సిసి లేదా కాంక్రీట్ శ్లాబులను మాత్రమే పైకప్పుగా వాడాలి.
- ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్‌లను అవసరమైన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలి. సెల్లార్‌లలో ఆటోమేటిక్ స్ప్రింక్లర్‌లు ఉపయోగించాలి.
- గోడౌన్‌లలో వస్తువులను నిల్వ ఉంచేటపుడు స్టాక్‌లకు మధ్య ఖాళీస్థలం ఉంచాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా ఎండిన గడ్డిని మాత్రమే వాములుగా వేసి, వాటిని నివాస ప్రాంతాలకు దూరంగా ఉండేలా చూసుకోవాలి.
- కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు అగ్నిప్రదేశాలు గుర్తించేలా చేయాలి. వారికి బేసిక్ ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణ ఇవ్వాలి.
- విద్యుత్ ప్రమాదాలపై నీటిని ఉపయోగించరాదు. పొడి ఇసుకను మాత్రమే వాడాలి.
- పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గోడౌన్‌లలో వాహనదారులు, బంక్‌ల యందు డీజల్‌గాని, పెట్రోల్‌గాని నింపుకొన్నపుడు వాహనం ఇంజను పూర్తిగా ఆఫ్ చేయాలి.
- వాహనదారులు ఇంధన నింపుకున్న తరువాత కొద్ది దూరం వెళ్లిన తరువాత బండి స్టార్ట్ చేయాలి.
- వాహనదారులు గాని అక్కడ పనిచేస్తున్న సిబ్బందిగానీ పెట్రోల్ బంక్ ఉన్న ప్రదేశంలో బీడీగాని, సిగరెట్‌గాని కాల్చరాదు. సెల్‌ఫోన్ ద్వారా సంభాషించరాదు. నీటివసతి అందుబాటులో ఉండాలి.

కాళీయమర్దనుడిగా కోదండ రాముడు



మాడ వీధుల్లో ఊరేగుతున్న కాళీయమర్దనుడు


ఒంటిమిట్ట: ఏకశిలానగరిలో కొలువైన కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజైన ఆదివారం ఉదయం కాళీయమర్దన అలంకారంలో జగదభిరాముడిని ముస్తాబు చేశారు. పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. ఉదయం 7:30 నుంచి 9:30 గంటల వరకు స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా స్వామి వారు గ్రామ వీధుల్లో విహరించారు. అనంతరం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపనతిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన కోదండ రామ ఉత్సవ మూర్తులకు విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు.

అశ్వవాహనంపై ఒంటిమిట్ట విభుడు

రాత్రి 7 నుంచి 8:30 గంటల వరకు అశ్వ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలుగా వర్ణిస్తున్నాయి. అందువల్ల అశ్వాన్ని అధిరోహించిన పరమాత్మ ఇంద్రియాలను నియమించే నియామకుడు. పరమాత్ముడు అశ్వ స్వరూపంగా కృష్ణయజుర్వేదం తెలియజేసింది. స్వామి అశ్వవాహనాది రూఢుడై భక్తులకు దర్శనమిచ్చి తద్వారా తన కల్కి స్వరూపాన్ని ప్రకటిస్తూ కలిదోషాలకు దూరంగా ఉండాలని నామ సంకీర్తనాద్యుపాయాలను ఆశ్రయించి, తరించాలని ప్రబోధిస్తున్నాడు.

కప్పం కట్టాల్సిందే!

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్పీ పేరిట చెక్ జారీ చేయండి
- ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యాలకు అల్టిమేటం జారీ!
- ఎన్నికల ముందు సొంత డబ్బులతో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ
- నేడు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ ప్రైవేటు హాస్పిటల్స్‌పై వడ్డింపు



సాక్షి ప్రతినిధి, కడప: కూటమి ప్రభుత్వంలో రోజుకో దౌర్జన్యం వెలుగు చూస్తోంది. హామీల అమలు మాటేమోగానీ సొంత పైత్యాన్ని ప్రజలపై రుద్దుతోంది. ముఖ్యంగా కడప నగరంలో స్వాహాపర్వం ఎక్కువైంది. తాజాగా ప్రైవేటు హాస్పిటల్స్ యాజమాన్యాలు లక్ష చొప్పున చెల్లించాలని అల్టిమేటం జారీ అయ్యింది. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేదని.. ఎమ్మెల్యే మాధవీరెడ్డి అభ్యర్థన మేరకు కప్పం కట్టాల్సిందిగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రైవేటు ఆస్పత్రుల యాజమానులను ఆదేశించడం గమనార్హం.

- కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి శుష్క వాగ్దానాలు ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయి. నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేకమైన మేనిఫెస్టో అంటూ హామీలిచ్చిన ఆమె, ఆ తర్వాత మాట మారుస్తున్నారు. నగరం మధ్యలోంచి వెళ్లే బుగ్గవంకపై డాక్టర్ వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు ఆరు వంతెనలను నిర్మించాయి. మరో రెండు లోలెవెల్ వంతెనలను వైఎస్ జగన్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఎన్నిక కోడ్ రావడంతో ఆ పనులు పెండింగ్ పడ్డాయి. గుర్రాలగడ్డ టు షామీరియా బ్రిడ్జి లోలెవెల్ కాజ్‌వే, రవీంద్రనగర్ టు నాగరాజుపేట లోలెవెల్ కాజ్‌వే పనులు పూర్తి చేయించే బాధ్యత తనదేనని, ఎన్నికలయిన 15 రోజుల్లో పనులు ప్రారంభించి ఆరునెలల్లో షామీరియా మసీదు వద్ద బ్రిడ్జి పూర్తి చేస్తామని ప్రకటించారు. అవసరమైతే సొంత నిధులు సైతం వెచ్చిస్తానని మాధవిరెడ్డి హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆ మాటే మరుగున పడింది. నగరంలోని రోడ్ల విస్తరణ, కూడళ్ల అభివృద్ధి, వంతెనల నిర్మాణం పనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా 2023 జూన్ 16వ తేదీన రూ.305.51 కోట్లు విడుదల చేస్తూ జీవో ఇచ్చారు. వెంటనే పనులు ప్రారంభించారు. 6 పనులకు గాను 4 పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మిగిలిన 2 పనులను పూర్తి చేయాల్సి ఉంది. కాగా వాటిని ఎమ్మెల్యే మాధవిరెడ్డి స్వయంగా రద్దు చేయించారు. వైఎస్సార్ సీపీకి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పేరు రాకూడదనే ఉద్దేశంతో వాటిని రద్దు చేయించిన ఎమ్మెల్యే, అవే పనులను జీఓ ఆర్టీ 285 ఏప్రిల్ 7న తాజాగా ఉత్తర్వులు తీసుకొచ్చి ప్రచార ఆర్భాటాల్లో మునిగితేలుతున్నారు.

కాదనలేని భయానక పరిస్థితులు

కూటమి సర్కార్ వచ్చిన తర్వాత మునుపెన్నడూ లేని రీతిలో నగరంలో వ్యక్తుల వ్యాపారాలు సైతం స్వాహా తెరపైకి వచ్చింది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా మద్యం వ్యాపారం చేస్తున్న లక్ష్మిరెడ్డికి చెందిన రెండు బార్ అండ్ రెస్టారెంట్లు తెలుగుతమ్ముళ్లు బలవంతంగా లాక్కున్నారు. కాదనలేని పరిస్థితులు కల్పించారు. ఆపై వైరి పక్షంగా ఉన్నవారిపై పెత్తనం చెలాయించేందుకు కార్పొరేషన్, పోలీసు విభాగాలను యథేచ్ఛగా వాడుకుంటున్నారు. అధికారులు సైతం అధికార పార్టీ అండ ఉంటే చాలంటూ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో ఐఎంఏ ఆదేశాల మేరకు ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు లక్ష చొప్పున చెల్లించలేమంటూ బాహాటంగా చెప్పలేని పరిస్థితులు ఉన్నాయి. అధికార, అనధికార సైన్యంతో ఇక్కట్లు ఎదుర్కోవాల్సివస్తుందేమోనని పలువురు వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సొంత నిధులతో సీసీ కెమెరా ఏర్పాటు చేస్తామని ప్రకటన

ప్రతి వీధిలో సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ఎన్నికల ముందు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అందుకు రూ.50లక్షలు వెచ్చించనున్నట్లు ప్రకటించారు. 9నెలలు తర్వాత ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు లక్ష చొప్పున చెల్లించాల్సిందిగా అల్టిమేటం జారీ చేయించారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు ఐఎంఏ ప్రతినిధులు వైద్యులకు మేసేజ్ పాస్ చేశారు. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు లక్ష చొప్పున చెల్లించాల్సిందిగా ఎస్పీ పేరిట చెక్ ఇవ్వాల్సిందిగా దిశా నిర్దేశం చేశారు. అధికారం హోదా రాగానే సొంత నిధులు మాట కనుమరుగయ్యింది. ఇదేంటి ఎప్పుడూ లేని పరిస్థితులు జిల్లా కేంద్రంలో ఉత్పన్నమవుతున్నాయంటూ ప్రైవేటు వైద్యులు మదనపడుతున్నారు.

వైభవంగా కమలాపురం ఉరుసు

- భక్తులతో కళకళలాడిన దర్గా ప్రాంగణం
- అలరించిన ఖవ్వాలీ పోటీ



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న అంజద్ బాషా, నరేన్ రామాంజులరెడ్డి తదితరులు

కమలాపురం: కమలాపురం పట్టణంలో వెలసిన హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వి ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్ల ఉరుసు మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రధాన ఉరుసు మహోత్సవం భక్తుల కోలాహలం నడుమ వైభవంగా జరిగింది. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈ దర్గాకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి కులమతాలకు అతీతంగా భక్తులు వేలాదిగా తరలి రావడంతో దర్గా ఆవరణం కిటకిటలాడింది. భక్తులు దర్గాలోని స్వామి వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి చదివింపులు చేశారు. పీఠాధిపతి మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రిని భక్తులు గౌరవ పూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు. జాయింట్ వీల్స్, బ్రేక్ డ్యాన్స్, తదితర రంగుల రాట్నాల వద్ద పిల్లల సందడి కనిపించింది.

- కమలాపురం పెద్ద దర్గా ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకొని దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన ఖవ్వాలి పోటీ ఆద్యంతం అలరించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఢిల్లీకి చెందిన ఖుత్‌బీ బ్రదర్స్, యూపీ కి చెందిన సర్ఫరాజ్ అన్వర్ సాబిరి ల మధ్య వేకువ జాము వరకు ఖవ్వాలీ పోటీ ఉత్సాహ భరితంగా సాగింది. ఖవ్వాలి ప్రేమికులు ఖుషీ ఖుషీగా నజరానా సమర్పించారు.


వైఎస్సార్ సీపీ నాయకుల ప్రత్యేక ప్రార్థనలు

కమలాపురంలో వెలసిన దర్గా–ఏ–గఫారియా, జహీరియా ఉరుసు మహోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం రాత్రి దర్గా కన్వీన ఇస్మాయిల్ ఆహ్వానం మేరకు మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి దర్గా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వామి వారి మజార్లపై చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతి ఆశీస్సులు అందుకున్నారు. అంతకు ముందు నాయకులు రాకను పురస్కరించుకుని ఇస్మాయిల్ దర్గా మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం పీఠాధిపతి వారిని సన్మానించారు. ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఖవ్వాలీ పోటీని తిలకిస్తున్న జనం (ఇన్‌సెట్) ఖవ్వాలీ గాయకులు

రసవత్తరంగా సాగిన బండలాగుడు పోటీలు



రాతిదూలాన్ని లాగుతున్న ఎడ్లు

స్థానిక దర్గా–ఏ–గఫారియాలో జరుగుతున్న అబ్దుల్ గఫార్ షా ఖాద్రి ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాడుగు పోటీలు రసవత్తరంగా సాగాయి. జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి వచ్చిన 11 కాండ్ల జతల ఎడ్లు పోటీలో తలపడ్డాయి. ఇందులో ప్రొద్దుటూరు అయోధ్య నగర్‌కు చెందిన బీసీఎస్‌ఆర్ బుల్స్ అధినేత వెంకటసాయి భవిత్‌రెడ్డి ఎడ్లు 5107 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి ఎడ్లు 4694 అడుగులతో ద్వితీయ స్థానంలో, దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన టి.అశోక్ ఎడ్లు 4600 అడుగులతో తృతీయ స్థానంలో, కమలాపురం మండలం జంగంపల్లెకు చెందిన నాగ సుబ్బారెడ్డి ఎడ్లు 4470 అడుగులతో నాల్గవ స్థానంలో నిలిచాయి. కాగా నిర్వాహకులు విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు అందజేశారు.

క్లుప్తంగా

చేబ్రోలు కిరణ్‌పై చర్యలు తీసుకోవాలి



కడప వన్‌టౌన్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి, సునీతా రెడ్డి

కడప అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతమ్మలను వ్యక్తిగతంగా కించపరిచే విధంగా మాట్లాడిన చేబ్రోలు కిరణ్‌కుమార్‌పై, అతనిని ఇంటర్వ్యూ చేసిన యాంకర్‌పై చర్యలు తీసుకోవాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్ర రెడ్డి, కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు సునీతా రెడ్డి కోరారు. ఈమేరకు కడప వన్ టౌన్ సీఐ బి. రామకృష్ణ, ఎస్ఐ అమర్‌నాథ్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.

కారు ఢీకొని బాలుడికి గాయాలు



కారు ఢీకొన్న ఘటనలో గాయపడిన బాలుడు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని నెల్లూరు రోడ్డు నుంచి శివాలయంకు వెళ్లే రోడ్డులో ఆదివారం కారు ఢీకొన్న ఘటనలో ఓ బాలుడికి గాయాలయ్యాయి. పట్టణంలోని గౌరీశంకర్ నగర్‌కు చెందిన రాజు, క్రిష్ణవేణిల కుమారుడైన గుర్రాల వెంకటనాగేష్ (11) శివాలయం రోడ్డు నుంచి నెల్లూరు రోడ్డు వైపు వస్తుండగా ప్రొద్దుటూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో ఎడమ కాలు విరిగింది. వెంటనే స్థానికులు బాలుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.

బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డి.ఎం. ఓబులేసు, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : బీసీల ఆశాజ్యోతి, రిజర్వేషన్ల పితామహుడు, హక్కుల కోసం నిరంతరం శ్రమించిన మహోన్నత వ్యక్తి బీపీ మండల్ అని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎం. ఓబులేసు యాదవ్ అన్నారు. ఆదివారం కడపలో ఆయన 43వ వర్ధంతిని బీసీ వసతి గృహ విద్యార్థులతో కలసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన వర్ధంతి, జయంతిలను రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ నాయకులు వంశీ, వేణు శ్రీను, రాము విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు దుకాణంలో చోరీ

- 10 కేజీల వెండితోపాటు బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీం

ఖాజీపేట : ఖాజీపేట బస్టాండ్‌లోని బంగారం దుకాణంలో చోరీ సంఘటన పెద్ద సంచలనంగా మారింది. పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలోనే చోరీ జరగడం, అలాగే దుకాణంలో 10 కేజీల వెండితోపాటు 20 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లడం అందరినీ భయాందోళనకు గురి చేస్తోంది. వివరాల్లోకి వెళితే ఖాజీపేట బస్టాండ్ కూడలిలో వీఎస్ బంగారం దుకాణం ఉంది. ఈ దుకాణం ఖాజీపేట పోలీస్ స్టేషన్‌కు 50 మీటర్ల పరిధిలోనే ఉంది. ఉదయం 6 గంటల సమయంలో బస్టాండ్‌కు వచ్చిన వారు బంగారం దుకాణం తెరిచి ఉండటం గమనించి దుకాణం బోర్డు పై ఉన్న నెంబర్ ఆధారంగా దుకాణం యజమాని అయిన వాహిద్‌కు సమాచారం ఇచ్చారు.

సీసీ కెమెరాలలో దొంగల ఆనవాళ్లు..

బస్టాండ్ కూడలిలో ఉన్న బంగారం దుకాణంలో సీసీ కెమెరాలు ఉన్నాయి. దుకాణం ఆనుకుని ఉన్న మరో దుకాణంలో సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిని పరిశీలించి చూడగా అందులో చోరీ సంఘటన దృశ్యాలు కనిపించాయి. చోరీ సంఘటన ఆదివారం తెల్లవారుజామున 1 గంట నుంచి 1:45 నిమిషాల మధ్య జరిగినట్లు కనిపించింది. చోరీలో ముగ్గురు దొంగలు పాల్గొన్నారు. అందరూ ముఖానికి పూర్తిగా ముసుగు ధరించి ఉన్నారు. కళ్లు కనిపించకుండా అద్దాలు పెట్టుకున్నారు. చేతి గుర్తులు పడకుండా గ్లౌజ్‌లు వేసుకున్నారు. ఒకరు ఎవ్వరైనా వస్తున్నారా లేదా అని పరిశీలిస్తున్నారు. మరో ఇద్దరు పెద్ద రాడ్ సహాయంతో దుకాణం బయట ఉన్న బీగం పగుల కొట్టారు. లోన ఉన్న చిలుకును రాడ్ సహాయంతో తొలగించి దుకాణంలోకి ప్రవేశించారు. దుకాణం బయట ఉన్న సీసీ కెమెరాలను గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. దుకాణంలోని రెండు సీసీ కెమెరాలను తొలగించిన అనంతరం దుకాణంలోని వెండి వస్తువులు, బంగారం చోరీ చేశారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

10 కేజీల వెండి చోరీ..

దుకాణం మూసి ఇంటికి వెళ్లేటప్పుడు దుకాణంలోని బంగారంతోపాటు నగదును తీసుకు వెళుతుంటారు. వెండి ఆభరణాలు మరమ్మతులకు వచ్చే బంగారం దుకాణంలో ఉంచి వెళుతుంటారు. అలా వదిలి వెళ్లిన వెండి సుమారు 10 కేజీలు, అలాగే 20 గ్రాముల బంగారం ఉంటుందని దుకాణం యజమాని తెలిపారు. అయితే పోలీసుల విచారణలో 10 కేజీల వెండి ఆభరణాలకు సంబంధించి బిల్లులు చూపాలని పోలీసులు కోరారు. బిల్లులు లేనివి కేసులో నమోదు చేయడం కుదరదని బిల్లులు ఉన్న 4 కేజీల వెండి అలాగే 15 గ్రాముల బంగారం పోయినట్లు గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో దుకాణంలో చోరీ విఫలం

ఖాజీపేట బస్టాండ్ కూడలిలోని మదీనా బంగారం దుకాణంలో చోరీ యత్నం విఫలమైనట్లు తెలుస్తోంది. దుకాణం ముందు భాగంలోని సీసీ కెమెరా పగిలి పోవడం, అలాగే బీగాన్ని పగులగొట్టే ప్రయత్నం చేసిన ఆనవాళ్లను దుకాణం యజమాని గుర్తించారు. విషయం పోలీసులకు తెలుపడంతో వాటిని కూడా పోలీసులు పరిశీలించారు.



పగులగొట్టి బయట పడేసిన సీసీ కెమెరాలు



దుకాణం బీగాన్ని పగులగొట్టిన దృశ్యం

డీఎస్పీ, క్లూస్ టీం పరిశీలన

చోరీ జరిగిన విషయం తెలిసిన వెంటనే మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్ర ప్రసాద్, ఖాజీపేట సీఐ మోహన్ అక్కడికి చేరుకున్నారు. దుకాణంలోకి ఎవ్వరూ వెళ్ల కుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీం అక్కడికి చేరుకుని వేలిముద్రలతోపాటు దొంగల సమాచారం సేకరించే ప్రయత్నం చేశారు. యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పేదల పక్షాన పోరాటమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పేదల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేసి వారికి అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఎర్రన్నకొట్టాలు వాసులతో ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడారు. కొర్రపాడు రోడ్డు విస్తరణకు సంబంధించి అధికారులు పరిహారం ఇవ్వకుండానే కూల్చేస్తామని చెబుతున్నట్లు బాధితులు రాచమల్లుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొప్పరపు సుబ్బారావు కుటుంబీకులతో ఎర్రన్నకొట్టాలు వాసులు స్థలాలు కొనుగోలు చేశారన్నారు. అయితే ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్‌తోపాటు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వారిది పట్టా స్థలం కాదని, డీకేటీ అని చెబుతున్నట్లు ప్రజలు వాపోతున్నారన్నారు. పరిహారం చెల్లించకుండా గోడలోని ఏ ఒక్కరాయిని తొలగించినా వైఎస్సార్‌సీపీ వారికి అండగా పోరాటం చేస్తుందన్నారు. ఎప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా ఎర్రన్నకొట్టాలుకు ముప్పు పొంచి ఉంటోందన్నారు. మైదుకూరు రోడ్డులో సర్పంచ్ శివచంద్రారెడ్డి కాంప్లెక్స్ స్థలం ప్రభుత్వానిది అని చెప్పినా పట్టించుకోరు కానీ పేదలు తమది పట్టా స్థలం అని చెప్పినా ఎందుకు తొలగించాలనుకుంటున్నారో తమకు అర్థం కావడం లేదన్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ ఎర్రన్నకొట్టాలు వాసులతో సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు విస్తరణపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, రాజుపాళెం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ నారాయణరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.



పేదలది పట్టా భూమి అని పత్రాలు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

పెన్షనర్లకు డీఏ, ఐఆర్‌లను ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి కరువుభత్యం, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 జనవరి నుంచి మూడు విడతల కరువు భత్యం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే రాష్ట్ర పభుత్వం కనీసం ఒక్క డీఏ కూడా ప్రకటించలేదన్నారు. 2023 జులై నుంచి పీఆర్సీ అమలులోకి రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా కనీసం 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించలేదన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్ రెడ్డి, అబ్దుల్ సత్తార్, జిల్లాకౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, క్రిష్టారెడ్డి, కొండారెడ్డి, మల్లికార్జున, రామసుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి

వైద్య ఉద్యోగుల సమస్యల సాధనకు ఉద్యమం

పీహెచ్ఎంఈయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పలు దఫాలుగా ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించాం. అయినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి కదలిక లేదు. దీంతో ఆందోళన కార్యక్రమాలు, సమ్మె ద్వారా హక్కులను సాధించుకోవడానికి సిద్ధపడుతున్నట్లు పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్ రావు అన్నారు. ఆదివారం స్థానిక కింగ్స్ ఫంక్షన్ హాలులో ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (పీహెచ్ఎంఈయూ) జిల్లా, జోనల్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆస్కార్‌రావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులకు ఇతర శాఖల విధులు ఆటంకంగా మారాయన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మె ద్వారా హక్కులను సాధించుకుంటామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆహారోన్ మాట్లాడుతూ తాము ప్రభుత్వం ముందు ఉంచిన సమస్యలన్నీ ఆర్థికేతర అంశాలేనని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్ఎం ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు

నూతన కార్యవర్గం ఎన్నిక..

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఎర్రపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శిగా ఎస్ఎండీ మహబూబ్‌బాషా, కోశాధికారిగా జనార్దన్‌బాబు, ఉపాధ్యక్షుడిగా సుధాకర్ బాబు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు టీ.డీ.కే సాగర్, ఉపాధ్యక్షుడు లక్ష్మీ నారాయణ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలికలకు ఉచిత విద్య, వసతి

కడప కల్చరల్ : అర్హులైన నిరుపేద, తల్లిదండ్రులు లేని ప్రతిభ కలిగిన బాలికలకు విద్య అందించేందుకు ఆర్తి హోమ్ సిద్ధంగా ఉందని సంస్థ చీఫ్ ప్యాట్రన్ పీవీ సంధ్య తెలిపారు. 'ఆర్తీ కేర్స్ ఇనిషియేటివ్' పథకంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె సంస్థ కార్యాలయంలో పథకం గురించి ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. 10వ తరగతి పూర్తి చేసిన నిరాశ్రయులు లేదా ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన బాలికలకు ఉచిత విద్య, వసతి అందించేందుకు ప్రత్యేకంగా ఈ పథకాన్ని రూపుదిద్దామన్నారు. ఇందులో ప్రవేశాల కోసం ఈనెల 25వ తేదీన కడప నగరంలోని మున్సిపల్ స్టేడియం వద్దగల ఆర్తీ హోంలో సామర్థ్య పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎంపికైన బాలికలకు ఉచిత విద్య, వసతితోపాటు కెరీర్ గైడెన్స్ కూడా అందజేస్తామన్నారు. ఆసక్తి గల బాలికలు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, పూర్తి వివరాలకు సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు హెడ్మాస్టర్, ఆర్తీహైస్కూలు మొబైల్ నంబర్ 8074717196, 8331951098, 8106123469లలో సంప్రదించాలన్నారు.

మెడికల్ ఏజెన్సీలో చోరీ

కడప అర్బన్ : కడప నగరం బీకేఎం వీధిలో ఈశ్వర్ మెడికల్ ఏజెన్సీలో గుర్తుతెలియని దొంగలు జొరబడి నగదును అపహరించినట్లు కడప టూ టౌన్ ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు కడపకు చెందిన శివకుమార్ ఈనెల 11వ తేదీ రాత్రి తమ ఏజెన్సీ మూసుకొని ఇంటికి వెళ్లాడు. తిరిగి ఉదయం వచ్చి చూసేసరికి తమ ఏజెన్సీ షట్టర్ పగలగొట్టి దొంగలు చొరబడి రూ.1.21 లక్షల నగదును అపహరించినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్‌బీఐలో చోరీ

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని కొత్త రోడ్డులోగల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో 30 వేల రూపాయలు నగదు, సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్ బాక్స్‌ను దొంగిలించినట్లు సమాచారం. సీఐ కృష్ణారెడ్డి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని యువకుడి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : ఉప్పరపల్లి రైల్వేగేటు వద్ద గుర్తు తెలియని యువకుడు(25) ఆదివారం వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రేణిగుంట రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

కంపోస్టు యార్డులో అగ్ని ప్రమాదం



కంపోస్టు యార్డులో కాలుతున్న వ్యర్థాలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని పాటిపాడు రోడ్డులో ఉన్న మున్సిపల్ కంపోస్టు యార్డులో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను కంపోస్టు యార్డులో నిల్వ ఉంచారు. సుమారు 20 ఎకరాల్లో కంపోస్టు యార్డు ఉంది. ఇందులో వివిధ రకాల వ్యర్థాలు నిల్వ చేస్తున్నారు. ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో కంపోస్టు యార్డులోని సుమారు రెండు ఎకరాల్లో మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగలు వ్యాపించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మంటలు వ్యాపించకుండా సిబ్బందిచే చర్యలు తీసుకున్నారు. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది అర్ధరాత్రి వరకు శ్రమించాల్సి వచ్చింది.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు అయ్యే వరకు పోరాడతాం

జాయింట్ యాక్షన్ కమిటీ నిరసన ప్రదర్శన

కడప కల్చరల్ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లు రద్దయ్యేంత వరకు తమ తీవ్ర నిరసనలు తెలుపుతూనే ఉంటామని వక్ఫ్ బోర్డు జాయింట్ యాక్షన్ కమిటీ స్పష్టం చేసింది. ఆదివారం వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన తెలుపుతూ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కడప నగరంలో ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ నగరానికి చెందిన పలు ముస్లిం సంఘాలు ఐక్యంగా ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. కడప నగరం నబీకోట నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పాత బస్టాండ్ మీదుగా నాగరాజుపేట, సీఎస్ఐ సర్కిల్, ఎస్ఆర్ సర్కిల్, సెవెన్ రోడ్స్ సర్కిల్ వరకు సాగింది. అక్కడ పెద్ద ఎత్తున సమావేశమైన ముస్లిం సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. ముస్లింల పట్ల ఒకవైపు ప్రేమ చూపుతూ, మరోవైపు వారి మనోభావాలు దెబ్బతీసేలా వక్ఫ్‌బోర్డు బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం పట్ల వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కేవలం ముస్లింలను టార్గెట్ చేసుకున్న బీజేపీ ప్రభుత్వం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు ప్రభుత్వానికి సంబంధించినవి కావని, కేవలం ముస్లిం మైనార్టీల ఆస్తులు మాత్రమేనని వారు స్పష్టం చేశారు. ఈ సవరణలు పూర్తిగా రద్దు చేసేంతవరకు ఈ పోరాటాలు చేస్తూనే ఉంటామని, అంతేకాకుండా రద్దు ఆలస్యం చేస్తే పోరాటాలు మరింత ఉధృతం చేయగలమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలు, మైనార్టీలు పాల్గొన్నారు.



ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు



కడపలో జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

ఆదివాసీలపై నరమేధాన్ని ఆపాలని 20న కడపలో సదస్సు

ప్రొద్దుటూరు క్రైం : దండకారణ్య ప్రాంతంలో ఆదివాసీలపై, మావోయిస్టులపై జరుగుతున్న నరమేధాన్ని కేంద్ర సాయుధ బలగాలు వెంటనే ఆపాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చీమలపెంట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సృజన కార్యాలయంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై సాగిస్తున్న యుద్ధాన్ని ఆపాలని ఈనెల 20న కడప గాంధీనగర్‌లోని ఇంజినీర్స్ భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతాల్లో విస్తరించిన నక్సలైట్లను తుదముట్టించి అడవుల్లో ఉండే విలువైన ఖనిజ సంపదనంతా అంబానీ, అదాని, ఎస్సార్ టాటా లాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కొన్నేళ్లుగా ఈ నరమేధాన్ని కొనసాగిస్తోందన్నారు. జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, సృజన సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ, ఆర్‌వీవీ సభ్యులు కడ్డి సుబ్బయ్య, పద్మ, హమీద్ బాషా, షరీఫ్, రిటైర్డు డీఆర్‌డీఏ పీడీ గోపాల్, ఆర్‌వీఎస్ హరిత తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

ట్రిపుల్ ఐటీలో స్పోర్ట్స్ కోటాను అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లాలోని ట్రిపుల్ ఐటీలో స్పోర్ట్స్ కోటా విద్యార్థులకు కచ్చితమైన రిజర్వేషన్‌ను అమలు చేయాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా క్రీడల శాఖ 2012 ఆగస్టులో 74 జీఓ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, కార్పొరేషన్ బోర్డులు, గ్రంథాలయ సంస్థలు, మార్కెట్ కమిటీలతోపాటు ఇంకా పలు రకాల నిధులు మంజూరు చేసి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రెండు శాతం స్పోర్ట్స్ కోట రిజర్వేషన్ అమలు చేస్తుందన్నారు. అయితే రాయలసీమ వ్యాప్తంగా ఉన్న ఒకే ఒక్క ట్రిపుల్ ఐటీలో 0.5 శాతం మాత్రమే క్రీడాకారులకు రిజర్వేషన్ అమలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పోర్ట్స్ కోటా విద్యార్థులకు 74 జీఓ ప్రకారం 2 శాతం రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో ఆదివారం ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించారు. గంజాయి విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరోధించేందుకు పోలీసులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎర్రగుంట్ల రోడ్డు, పాల కేంద్రం, పెన్నానది పరివాహక ప్రాంతం, చిన్నశెట్టిపల్లె రోడ్డు, అమృతానగర్, పెద్దశెట్టిపల్లె గ్రామ పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో జల్లెడ పట్టి అనుమానాస్పదంగా సంచరించే వారిని గుర్తించే చర్యలు చేపట్టారు.



డ్రోన్ కెమెరాతో అసాంఘిక కార్యకలాపాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఆటో ఢీకొని ద్విచక్రవాహనదారుడికి గాయాలు

ముద్దనూరు : మండలంలోని డీయస్‌పల్లె గ్రామ సమీపంలో ఆదివారం ఆటో ఢీకొని ద్విచక్రవాహనదారుడు నందకిషోర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు కొసినేపల్లె గ్రామానికి చెందిన కిషోర్ ముద్దనూరుకు మోటార్‌బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ఘటనలో కిషోర్ కాలికి తీవ్ర గాయం కాగా అతన్ని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- హత్యగా భావిస్తున్న పోలీసులు
- మృతదేహాన్ని పరిశీలించిన డీఎస్పీ

వేంపల్లె : వేంపల్లె మండలం నందిపల్లె గ్రామ సమీపంలో కమలాపురం నియోజకవర్గంలోని వల్లూరు మండలం పైడి కాలువ పంచాయతీ సీతోరుపల్లె గ్రామానికి చెందిన పంగా రామయ్య (21)అనే యవకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. వల్లూరు మండలానికి చెందిన పంగా వీరయ్య కుమారుడు పంగా రామయ్య కూలి పనులు చేసుకొనేవాడు. అయితే నందిపల్లి గ్రామ సమీపంలో కాలిన గాయాలతో రామకృష్ణారెడ్డి అరటి తోట వద్ద పడి ఉండడంతో అరటి తోట వద్దకు పనికి వెళ్లిన లక్ష్మీదేవి అనే మహిళ చూసి స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో కొన ఊపిరితో ఉన్న రామయ్యను వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, సీఐలు నరసింహులు, చాంద్‌బాషా ఘటన స్థలాన్ని పరిశీలించారు. అలాగే మృతుని తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ విలేకరులతో మాట్లాడుతూ పొలం పనులకు వెళ్లిన లక్ష్మీదేవి గమనించి రైతు రామకృష్ణారెడ్డికి సమాచారం ఇచ్చిందన్నారు. ఆయనతోపాటు నందిపల్లె గ్రామస్తులు కొందరు అక్కడికి వెళ్లి కాలిన గాయాలతో పడి ఉన్న యువకుడిని విచారించగా ముందు నీళ్లు ఇవ్వండి నేను మాట్లాడతానని చెప్పినట్లు తెలిపారు. అలాగే నీళ్లు తాగి మా నాన్న పేరు వీరయ్య అని చెప్పి ఫోన్ నెంబర్ ఇచ్చినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు రామయ్యను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఘటన స్థలంలో రామయ్యపై పెట్రోల్ కాని కిరోసిన్ కాని వేసి కాల్చిన ఆనవాళ్లు కనిపించలేదని చెప్పారు. వేరే ప్రాంతంలో కాల్చి రాత్రి సమయంలో నందిపల్లె ప్రాంతానికి తీసుకొని వచ్చి పడేసినట్లు ఉందన్నారు. రామయ్యది హత్య కేసుగానే భావిస్తున్నామన్నారు. వల్లూరు మండలంలో సీతోలుపల్లె నుంచి వీఎన్ పల్లెలో ఉన్న అక్క ఇంటికి భోజనానికి వెళుతున్నానని ఇంటిలో చెప్పి వెళ్లినట్లు తెలిసిందని చెప్పారు. సీతోలుపల్లె నుంచి వీఎన్ పల్లెకు వెళ్లలేదని తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు.



కాలిన శరీరంతో మృతి చెంది ఉన్న రామయ్య



విచారిస్తున్న సీఐలు



రోదిస్తున్న మృతుడి బంధువులు